


# ఇరసాల మిట్ట

డా॥ వి.ఆర్. రాసాని

"ఓమ్మో గోయిందూ! వొగటొగటే భద్రంగా బండికెయ్యండి."

అంగడి ముందర నిలబడి, యింటి ముందర తోసివున్న ఎద్దులబండివైపు చూస్తూ కేకేశాడు రంగనాథం.

అప్పటికే బండిలో నిలబడి మూటల్ని అందుకుని సర్దుతున్న దేవరాజులకు ఒక మూటను అందిస్తూ "నువ్వు అంగిట్లో కూసో. మేం జూసుకుంటాంగానీ" అంది అతని భార్య గోవిందమ్మ.



ఆ మాటతో అంగడిలోకి వెళ్లి గల్లాపెట్టె ముందర కూర్చొని నోట్‌బుక్ తీసుకుని లెక్కలు చూస్తూ వుండిపోయాడు రంగనాథం.

మాసిన బట్టల్తో వున్న బండి యజమాని కంబళ్ల లచ్చుమయ్య, వీధివైపున్న అరుగుపైన కూర్చొని తంబకర్ర నములుతూ బండి కవతల రాతి కూసానికి కట్టేసి వున్న తన బక్కెద్దుల్ని చూశాడు.

శరీరంపైన చియ్యకరువైన బక్కెద్దులు ఎండకు వొగురుస్తున్నాయి.

దేవరాజులు, గోవిందమ్మ మిగిలిన సంచుల్ని ఇంటిలో నుంచీ ఒక్కొక్కటే తెచ్చి బండికెక్కించడంలో మునిగిపోయారు.

"ఏమిరా రంగా! వొగ అగ్గిపెట్టె, బీడీకట్ట"

బండివైపు ఒకసారి పరిశీలనగా చూసి, డబ్బులందిస్తూ అడిగాడు గెల్లపల్లోళ్లవీరప్ప.

"ఏమన్నా ఈ రోజు ఆదివారం పులిచెర్ల సంతగదా! సంతకు పోలేదా?" చిల్లర తీసి గల్లాలో వేసుకుని అగ్గిపెట్టె, బీడీకట్ట అందిస్తూ ప్రశ్నించాడు రంగనాథం.

"మనిషి అయిపేలేదే రెండు దినాలనించీ... అదిసరే. ఈ సామాన్లన్నీ ఎక్కడికి?" కట్టలోనుంచీ ఒక బీడీని లాగి నోట్లోపెట్టుకు వెలిగించుకుంటూ అన్నాడు వీరప్ప.

"మా అల్లుడు దేవరాజులు మంగళం

పేటలో కొత్తగా అంగిడి పెట్నాడు గదా. కావాల్సినవి యేగేస్తావుండా. ఆడబిడ్డెను కన్నాక తప్పదుగదా!'' అన్నాడు రంగనాథం.

''అవున్లే! అదీ నిజమే. ఆడబిడ్డ బరువు సచ్చిందాకా మోయాల్సిందేగదా'' అంగడివైపున్న బెంచీపైన కూర్చుంటూ అన్నాడు వీరప్ప.

''ఊర్లో యింకొగ పెద్దంగిడున్నా తొలినుంచీ నా దెగ్గిరే అన్నీ కొంటూవుండేది నీవొక్కడివేన్నా'' అన్నాడు రంగనాథం.

''ఏమిరా రంగా... మన నేస్తం ఈ నాటిదా? నువ్వు ఈ వూరికొచ్చినప్పట్నించే మనం నేస్తులమైపోతిమి గదా.''

''అందుకేన్నా.... నా బాధలన్నీ నీదెగ్గిర చెప్పు కుండేది!''

''నిజమే!'' అన్నట్లు తలాడించి, బీడీ పొగను గాల్లోకి వదుల్తూ అంగడికల్లా చూశాడు.

అతని మనసుకు ఏదో వెలితిగా అనిపించింది. ఎప్పుడూ సరుకులతో నిండుగాను, సరాలు సరాలుగా వేలాడే పొట్లాలతోను కన్నుల పండువుగా కనిపించే అంగడి బోసిగా కనిపిస్తోంది.

''ఏమిరా, అంగిట్లో సరుకులన్నీ ఏమైనాయి'' ఆతృతగా అడిగాడు.

''మనం ఎప్పుడైనా కొనుక్కోవచ్చని అన్నీ అల్లునికే పంపిస్తావుండా. ఆ మూటలన్నీ అవే'' ఎద్దుల బండివైపు చూస్తూ అన్నాడు రంగనాథం.

దేవరాజులు సామాన్లు బండికేస్తూనే వున్నాడు. లచ్చుమయ్య తంబక్ర నమిలి వీధిని ఎర్రబారుస్తున్నాడు. ఒకరిద్దరు కూరగాయల తట్టల్ని నెత్తిన పెట్టుకుని పరుగులాంటి నడకతో వెళుతున్నారు. వెచ్చాల కోసం బ్యాగులు చేతబట్టుకుని నిర్లిప్తంగా వెళుతూ కొందరు. అదే వీధిలో నాలుగైదు యిండ్ల కవతల శీనయ్య అంగడిదగ్గర వస్తువులు కొనుక్కుంటూ మరికొందరు కనిపిస్తున్నారు.

తట్టనెత్తిన పెట్టుకుని సంతకు వెళుతున్న ఓ వ్యక్తిని ఆపి '' ఏందబ్బా తట్టలో'' అన్నాడు వీరప్ప.

''సింతపండబ్బా... ఏదో వొగిటి అమ్ముకొని బతకాలగదా'' అంటూ ముందుకు వెళ్లాడావ్యక్తి.

ఆ మాట వీరప్పకు ఎక్కడో గుచ్చుకున్నట్టయింది.

బీడీ తాగడం పూర్తి చేసి ముక్కను వీధిలోకి విసిరేసి 'వొగబ్బుడు ఈ రంగనాథం అంగడి ఎంత బాగా జరగతావుండె. అయిదారు ఊర్లకు యిదే మొదటి అంగిడి. ఈ చిల్లరంగిడితోనే గదా ఈ మిద్దిల్లు కొనుక్కున్నాడు. ఈ స్థితికి రావడానికి ఎన్ని కష్టాలు పడె, ఏం కతా?' అనుకుంటూ ఆలోచనల్లో పడిపోయాడు వీరప్ప.

యే బేరాలు లేక దిగాలుగా గోడకానుకుని ఆలోచిస్తూ కూర్చున్నాడు రంగనాథం.

ఆ కుటుంబం ఆ ఊరికొచ్చినప్పటికి రంగనాథంకు సరిగ్గా పదేండ్ల వయసు. వాళ్లమ్మ లచ్చుమక్క. బోండాలు, మురుకులు, సుగీలు, దోసెలు, పుల్లింట్లు, చట్నీ, సాంబారు.. గిన్నెలు ఒక గంపలో పెట్టుకుని ఉదయాన ఆరుకంతా పులిచెర్ల రైల్వేస్టేషను కెదురుగా వున్న బి.వి.రెడ్డి ఆయిల్ మిల్ ముందర ఒక కట్రాయిమీద కూర్చొని గంప ముందర పెట్టుకునేది. డ్యూటీలో వున్నవాళ్లు షిఫ్టులు మారే కూలీలు అక్కడే నాస్టాలు చేసేవారు. మిగిలిన అప్పచ్చుల్ని ఎత్తుకుని పట్టెడలోను, చుట్టుపక్కల పల్లెల్లోను తిరిగి అమ్ముకుని ఏ సాయంత్రానికో యిల్లు చేరేది లచ్చుమక్క. ఆమె మగడు కదిరప్ప గాజుల మలారం భుజానేసుకుని ఊరూర తిరిగి గాజుల వ్యాపారం చేసుకునేవాడు. ఆ యిద్దరికీ ముగ్గురు పిల్లలు. పెద్దవాడు రంగనాథం, తర్వాత యిద్దరు ఆడపిల్లలు. వాళ్ల సొంత ఊరు మంగళంపేట దగ్గర ఓ పల్లె. అక్కడ దాయాదులతో తగాదాలు వచ్చి ఆ ఊరు విడిచి ఆ పల్లెలో చేరింది ఆ కుటుంబం.

లచ్చుమక్క మంచితనం, చాకచక్యం ఆ కుటుంబానికి మూలాధారమైంది. ఆ ఊరిరైతు గెల్లపల్లోళ్ల సిద్దప్ప వాళ్లకు ఆశ్రయమిచ్చి తన గొడ్లకొట్టం వాళ్లకిచ్చాడు. ఆ సిద్దప్ప కొడుకే వీరప్ప. వీరప్ప రంగనాథం కంటే అయిదారేండ్లు పెద్దవాడు. అప్పుడే వాళ్లిద్దరికీ స్నేహం కుదిరింది. తన ఇంట్లో ఏదైనా వంటావార్పూ చేస్తే రహస్యంగా రంగనాథంకు వీరప్ప తెచ్చిస్తే వీరప్పకు రంగనాథం మిగిలిపోయిన అప్పచ్చులిచ్చేవాడు. యిద్దరూ కలిసి తిరిగారు, కలిసి పెరిగారు.

నీకు సరస్పతి అంటలేదు. లెక్కలు చూసుకునేది వచ్చింది సాల్లే. నీకొగ సిల్లరంగడి పెట్టిస్తా పల్లెవాళ్లతో బాగుండి యాపారం నడుపుకో. బతికిపోతావ్. యాడయినా నోరు మంచిదయితే ఊరు మంచిదయితుంది నాయనా

సిద్దప్ప గొడ్ల కొట్టంలోనే లచ్చుమక్క దశ తిరిగింది. బేరాలు పుంజుకున్నాయి. రాయికి రాయి గుట్టయినట్టు పైసాకు పైసా చేకూర్చుకోసాగింది. పిల్లలూ పెరగసాగారు. వంటలు చేయడంలో కూతుళ్లు సాయంచేస్తే కల్లూరడవికి వెళ్లి కట్టెలు కొట్టి తెచ్చి వంటచెరకు సమకూర్చేవాడు రంగనాథం.

ఆ గ్రామంలో లచ్చుమక్క అప్పచ్చులంటే విననివాడు, వాటిని రుచి చూడనివాడు వుండేవాడు కాదు. అలా లచ్చుమక్క కాస్త అప్పచ్చుల లచ్చుమక్క అయింది. ఆ పల్లె వాళ్లను అక్కున జేర్చుకుంది. రాను రాను ఆ కుటుంబం పల్లెవాళ్లలో పాలల్లో నీళ్లలా కలిసిపోయింది. కులాలు వేరైనా వరుసలు పెట్టుకుని పిలుచుకోవడం అలవాటైపోయింది.

రంగనాథం పదకొండు కొచ్చాడు. అతనికి బేరాలు, అంగడి, సంపాదనపైన వున్నంత శ్రద్ధ చదువుపైన లేకపోవడంతో సరిగా చదవలేకపోయాడు. చదువు అబ్బలేదు. పదకొండు ఫెయిలయ్యాడు.

''నీకు సరస్పతి అంటలేదు. లెక్కలు చూసుకునేది వచ్చింది సాల్లే. నీకొగ సిల్లరంగడి పెట్టిస్తా పల్లెవాళ్లతో బాగుండి యాపారం నడుపుకో. బతికిపోతావ్. యాడయినా నోరు మంచిదయితే ఊరు మంచిదయితుంది నాయనా'' అంటూ లచ్చుమక్క వ్యాపార రహస్యం చెప్పింది.

చివరింటి పాపయ్య ఏవో కష్టాలొచ్చి తన మిద్దిల్లు, చుట్టిల్లు కలిపి అమ్ముతున్నాడని తెలుసుకుని తన దగ్గరున్న డబ్బులన్నీ పోసి లచ్చుమక్క ఆ యింటిని కొనుక్కుంది. అక్కడే ఒక వార గదిలో రంగనాథంకు అంగడి కూడా పెట్టించింది. రంగనాథం వ్యాపారం బాగానే పుంజుకుంది. ఊరు కూడా పెరిగింది. లచ్చుమక్క, కదిరప్పలు వయసుమీద పడడంతో ''అమ్మా, ఎంత కాలమని కష్టపడతారుగానీ యింక మీరు యింటి పట్టునే వుండండి. సంసారం నేను చూసుకుంటాను గానీ'' అన్నాడు రంగనాథం.

''అయితే పెండ్లి చేసుకుంటావా? మా ప్రాణాలుండంగానే నీకూ పిల్లా జల్లా కలిగితే, వాళ్లను సూసుకోని ఆనందంగా సస్తాం'' అంది లచ్చుమక్క.

''సరే'' అన్నాడు రంగనాథం.


మంగళంపేటలో వుంటున్న తన అన్న కూతురు గోవిందమ్మను తెచ్చి కొడుక్కిపెళ్లి చేసింది. అతనికీ యిద్దరు పిల్లలు పుట్టారు. సంసారం హాయిగా గడిచిపోతుంది. పులిచెర్ల బ్యాంకులో రోజురోజుకీ రంగనాథం బ్యాలెన్స్ పెరగసాగింది. పులిచెర్లలో పెద్ద ఎత్తున వ్యాపారాలు చేసే అబ్బయ్యసెట్టి, హోటల్ సిద్దారెడ్డి, కొండ్రెడ్డి, సుబ్రమణ్యంలాంటి వారు కూడా వ్యాపారంలో రంగనాథం సలహాలను అడిగే పరిస్థితి కూడా ఏర్పడింది.

రంగనాథం బురదలో నుంచీ పుట్టిన వరిగొలకలా కిందనుంచీ పైకొచ్చినవాడు. అనేక కష్టనష్టాలను చవిచూసినవాడు. కాబట్టి పేద సాదలపట్ల దయాగుణం ప్రదర్శించేవాడు. ఊర్లో చదువుకునే పిల్లల తల్లిదండ్రుల అవసరానికి వెనుకాడేవాడు కాదు. అయితే వ్యాపారం దగ్గిర మాత్రం నిక్కచ్చిగా వుండేవాడు.

యిదేమని అడిగితే '' ఈడొస్తేగదా, ఆడిస్తాం'' అనేవాడు. సరుకుల్ని అప్పులిచ్చేవాడు. ఏ సంత నాడో వసూలు చేసుకునేవాడు. ఎంతో తెలివితేటలు ప్రదర్శించేవాడు. ఆ గుణంతోనే అయిదెకరాల పొలం కూడా సంపాదించాడు. అతని ప్రయోజకత్వాన్ని చూసి లచ్చుమక్క హాయిగా కన్ను మూసింది. ఆ దిగులుతోనే మరో ఆరునెలలకు కదిరప్ప కాలమైపోయాడు.

''హేయ్, హేయ్'' గట్టిగా కేకలు వినిపించడంతో ఆలోచించడం మాని అటువైపు చూశాడు రంగనాథం.

తమ ముందర పడవేసిన వరిగడ్డి పోచల



## సెలీనా సెక్స్‌పాఠాలు

**మ**నదేశంలో సెక్స్‌లైఫ్ అంటే సరైన అవగాహనే లేదు. శోభనం గదిలో మాత్రమే సెక్స్ మొదలవుతుందని పెద్ద వాళ్లు నూరిపోస్తారు. అదే విదేశాల్లో 13 ఏళ్లకే అన్నీ నేర్చు కుంటారు. అయితే ఎక్కువమంది మగవాళ్లకు సెక్సంటే శారీర కమే. అదే స్త్రీల విషయం వేరు. వాళ్లకు సెక్సంటే మానసికం. తరువాతే శారీరకం. జీవితంలో సెక్స్‌కి చాలా ఇంపార్టెన్స్ వుంది. సినిమాల్లోలాగా పార్కుల్లో తిరుగుతూ ఎంతసేపు మాట్లాడుకోగలం. తరువాత జరిగేది జరగాలిగా. మన కంటే మన పూర్వీకులకు ఎంతో సెక్స్ విజ్ఞాన ముంది. అందుకే ఖజురాహో శిల్పాలను మనకు అందించారు.

కోసం కుమ్ముకుంటున్నాయి ఎడ్లు. కేకలేస్తూ వాటిని అదుపుచేయడానికి పరిగెత్తి వెళ్లి అందులో ఒకదాన్ని విప్పి కాస్త దూరంగా కట్టేసి దాని ముందరా అన్ని వరిగడ్డి పోచలు విదిలించి వచ్చి యథాస్థానంలో కూర్చొని తంబకర్ర నములుకోసాగాడు లచ్చుమయ్య. అతను ఊచిన ఎంగిలిపైన జుమ్మంటూ ఈగలు వాలుతున్నాయి. బండి సరుకులతో సగం వరకు నిండిపోయివుంది. దేవరాజులు బండిపైనే నిలబడి గోయిందమ్మ యిచ్చే మూటల్ని సర్దుతున్నాడు.

ఇంతలో ఓ డొక్కుసైకిల్ మీద వేగంగా వచ్చి ఆ బండిని పరిశీలిస్తూ ఆగాడు కమ్మపల్లె దొరస్వామినాయుడు. వచ్చీరాగానే గణగణ మంటూ బెల్ వాయించి "ఏమిరా రంగా... మూటలన్నీ బండికెత్తుతావుండావు. ఊరొదిలి పోతావేందిరా!" అంటూ అడిగాడు.

"లేదులేన్నా రా" అంటూ పిలిచాడు రంగనాథం.

దొరస్వామినాయుడు సైకిల్ స్టాండ్‌వేసి వెళ్లి వీరప్ప ప్రక్కనే బెంచీపైన కూర్చున్నాడు. రంగనాథం కూడా అంగట్లోనుంచీ లేచివచ్చి వాళ్లపక్కనే కూర్చున్నాడు.

"నిన్ను చూస్తావుంటే ఏదో అనుమానంగా వుండాదిరా రంగా" ఆయాసపడిపోతూ అట్టపెట్టెల్ని, మూటల్ని అందిస్తున్న గోవిందమ్మను గమనిస్తూ అన్నాడు దొరస్వామి నాయుడు.

"అనుమానం ఎందుకన్నా... మా అల్లుని కోసరమనీ...." అంటూ వీరప్పకు చెప్పిన విషయమే చెప్పాడు రంగనాథం.

"వారే రంగడు. సీటీ పాడేదెప్పుడు?" అడిగాడు దొరస్వామి నాయుడు.

"రేపు పొద్దున్నే పదిగంటలకన్నా..." జవాబు చెప్పాడు రంగనాథం.

"ఈ తూరి నేను పాడుకోవాలబ్బా. ఎవురన్నా పోటీ వుండారా?"

"మఠానోళ్ల సహదేవుడు అడిగినాడన్నా..."

"యెట్లయినా సరే. ఈ తూరి నా కొచ్చేటిగా సూడబ్బా"

"నాదేముందన్నా?"

"చీటీ మేనజరు నీవేగదబ్బా. ఎన్నో యేండ్ల నించీ ఎంతో నమ్మకంగా సీటీలు నడపతా వుండావు. అంతమాత్రం సాదేవుడికి నచ్చజెప్ప లేవా? పోటీ వుంటే కసురు ఎక్కువపోతుందబ్బా. చేతికొచ్చేది తగ్గిపోతుంది." తన బాధను చెప్పాడు దొరస్వామి.

"ఏం కసురో ఏమోన్నా. లచ్చరూపాయల సీటీ. యింగొగటి యాభై యేల సీటీ. ఎత్తుకున్నోళ్లు తిరిగి కంతుకడితే గదా. చేతినించీ యేసుకుంటా వుండా. పాడినోళ్లకియ్యకపోతే ఊరికే వుంటారా?"

"మేనేజరన్నాకా తప్పుతుందా. కన్న కష్టాలుబడన్నా యిచ్చుకోవాలగదా"

"అందుకే ఎవుర్నీ ఏమీ అనలేకుండా వుండా"

"సరే. యెట్లో వొగట్ల వోడికి నచ్చసెప్పబ్బా. నిండా యిబ్బందిగా వుండాది"

"సెప్తాలే. రేపొచ్చేయన్నా..."

ఆ మాటతో నెత్తినున్న సగం బరువు దిగి పోయినట్టుగా ముఖం పెట్టి సైకిల్ తీసి సంతో షంగా తొక్కుకుంటూ తన ఊరివైపు వెళ్లిపోయాడు దొరస్వామి.

"కొంచెం జాగర్తగా వుండ్రారంగా. యిప్పటికే శ్యానా మంది సీటీ ఎత్తుకోని కంతులు కట్టలేదంటావుండావు. ఎట్లో వగట్ల వసూలు జేసుకో. లేకుంటే కొంపమునగ తాది" అంత వరకూ మౌనంగా వున్న వీరప్ప హెచ్చరించాడు.

"ఏం జేసేదన్నా. అయిదుమంది రైతులు సీటీ లెత్తుకొని కట్టలే. అయిదు లచ్చలు వసూలు గావాల" బాధపడుతూ అన్నాడు రంగనాథం.

"ముందే వూర్లో నువ్వుంటే గిట్టనోళ్లుం డారు. నెల క్రితమే గదా నీ సుట్టింటికి అగ్గిపెట్రి. సమేనికి అందరూ ఊర్లోనే వుండబట్టి సరిపాయ."

"అవునన్నా. ఊర్లో వోళ్లు నా కొంపను కాల్చనూ కాల్చిరీ. ఆర్పనూ ఆర్పిరి. ఆడికీ విలువైన గుడ్డా గుసురూ కాలిపాయనే."

"ఇంక నీ బతుకు కాలకుండా సూసుకో."

"ఏమీ దిక్కుతోచలేదన్నా."

"సరే. బాధల్లేంది ఎవురికి... దానికే యిదయిపోతే యెట్లా! యెట్లో వొగట్ల గడ్డన బడాల"

"ఏమిరా... అన్నీ బండికేస్తా వుండారు?" సంతనుంచీ తిరిగి వస్తున్న ఓ వ్యక్తి దేవరాజుల్ని పలకరించినాడు.

"ఏమీ లేదన్నా..." అంటూ అతని వైపు చూసి గోవిందమ్మ అందిస్తున్న ఓ అట్టపెట్టెను అందుకోబోయి సరిగా పట్టుదొరక్క అది కిందపడిపోయింది.

అది గమనించిన రంగనాథం ముఠాకూలీలతో "భద్రంగా ఎత్తి పెట్టండ్రా" అన్నాడు.

అడిగిన వ్యక్తి దేవరాజులు జవా బును పూర్తిగా వినకుండానే ముందుకు వెళ్లిపోయాడు.

రంగనాథం మళ్లీ ఆలోచనల్లోపడి పోయాడు.

ఆ ఊర్లో కొందరికి ఆతని ఎదుగుదల చూసి కన్నుకుట్టింది. ఆతనికి తెలీకుండానే ఓ వ్యతిరేక వర్గం తయారయింది. ఆ వర్గానికి నాయకుడు ఆ ఊరి సర్పంచ్ శీనయ్య. తమ కులానికి చెందిన వెంకయ్యను యెగదోశాడు. పోటీగా మరో అంగడి పెట్టమన్నాడు. చాలా రోజులుగా తనూ అంగడి పెట్టాలని ఉబలాటపడుతున్న వెంకయ్య శీనయ్య ప్రోద్బలంతో అంగడి పెట్టనే పెట్టాడు. శీనయ్య ఊర్లో తనకులస్తులందర్నీ సమావేశ పరచి "ఎక్కడినుంచో వచ్చిన రంగనాథాన్ని ఎందుకు బతికించడం. మన అందరం మన వెంకయ్య అంగడిలోనే సరుకుల్ని కొందాం" అంటూ హిత బోధ చేశాడు. అందరూ సరేనన్నారు. ఆ మరునాటి నుంచీ వెంకయ్య అంగట్లోను సందడి పెరిగింది. కానీ త్వరగా ధనవంతుడై పోవాలన్న యావతో లౌక్యం ప్రదర్శించలేకపోయాడు వెంకయ్య. కొద్ది రోజులకే వ్యాపారం పడిపోయింది. జనం "ఎన్ని మాట్లాడినా రంగనాథమే నయం"

అంటూ మళ్లీ పాత అంగడికే పోవడం ప్రారంభించారు. ఇది సహించలేని శీనయ్య వెంకయ్యలు రాత్రివేళ, ఎండాకాలంలో వరండాలో అంగడి ముందర నిద్రపోతున్న రంగనాథంపైన ఆసిడ్ పోసేశారు. చీకట్లో ఏం జరిగిందో తెలీని రంగనాథం కేకలు వేసి మంటకు లబలబమంటూ నోరు కొట్టుకుంటూ బెబ్బరించాడు. ఊరు లేచి వచ్చింది. అక్కడే పడివున్న ఆసిడ్ సీసాను చూసిన కొందరు వెంటనే అతనిపైన నీళ్లపోశారు. అయినా ఆతని కాళ్లు కాలి తెల్లమచ్చలేర్పడ్డాయి. పోలీసు కేసయింది. కానీ నిందితుల్ని మాత్రం పోలీసులు పట్టుకోలేదు. రంగనాథం దగ్గర డబ్బులు తిని బొజ్జలు పెంచుకున్నారే తప్ప న్యాయం చేయలేదు. అయినా రంగనాథం ఎవరినీ నిందించలేదు. మళ్లీ అందరితో ఒకేలాగున్నాడు.

రంగనాథం తన వ్యాపారాన్ని యింకా అభివృద్ధి చేయాలనీ, బిడ్డల్ని బాగా చదివించుకొని పట్నంలో పెద్ద ప్రొవిజన్స్ షాపు పెట్టాలని కలలు కనేవాడు.

ఎవరో తరుముకొస్తున్నట్లు వేగంగా దుమ్ము రేపుకుంటూ హీరోహోండా మీద వచ్చి ఆగాడు డేసిరెడ్డిగారి పల్లె రవి. ఆ శబ్దానికి రంగనాథం ఆలోచన్లు తెగిపోయాయి.

''ఏమబ్బా రవీ, కొంచెం మెల్లిగా వస్తే ఏమబ్బా'' అన్నాడు వీరప్ప.

''పనిమింద పోతావుండాలేమామా. ఓ రంగాన్నా సీటీ ఎన్ని గంటలకు'' అడిగాడు రవి.

''నువ్వు నాలుగు నెలలముందే ఎత్తేస్తివి. యింకేముండాది నువ్వెత్తేదానికి?'' అన్నాడు రంగనాథం.

''మా సిన్నాయనోళ్లు యేస్తావుండారుగదా సీటీ, దాన్ని ఎత్తుకుందామని''

''వోళ్ల సీటీ నువ్వెత్తేస్తే యెట్లా?''

''మా సిన్నాయనన్నడిగినాలే''

'' ఏమన్నాడు?''

''కంతులు నువ్వే కట్టుకునేట్టుంటే ఎత్తుకో అన్నాడు''

''నువ్వెత్తిన చీటికే సరిగా కంతులు కట్టలేనోడివి. దానికి మాత్రం ఎట్ల కడతావ్?'' ఎత్తి పొడుపుగా అన్నాడు రంగనాథం.

''కట్టేస్తాలేన్నా. యాడికి పోతావుండాగానీ....'' అన్నాడు రవి.

''ఏమోబ్బా... ఆయన సీటీని ఆయనే ఎత్తుకోని, ఆయన్నే కంతులు కట్టమను'' నిక్కచ్చిగా చెప్పేశాడు రంగనాథం.

''సరే. మా సిన్నాయన్నే తీసుకొస్తాలే'' అంటూ బైకును ముందుకు దూకించాడు రవి.

వీరప్ప మౌనంగా చూస్తుండిపోయాడు.

రంగనాథం ముఖం మబ్బేసుకుంది.

''రంగా, నిన్ను సూస్తావుంటే దిగులేస్తవుండాదిరా. అందిరి దెగ్గిరా మంచోడు, నమ్మకస్తుడు అనిపించుకుంటి. భూస్వాములు వాళ్ల డబ్బులన్నీ దెచ్చి వడ్డీలకు తిప్పమని నీకిచ్చిరి. నువ్వేమో ఆ డబ్బుల్ని యాపారం పైన పెడతావస్తివి. కడాకు నువ్వే అప్పుల్లో పడిపోతివి'' నిర్లిప్తంగా అన్నాడు వీరప్ప.

''ఏం జేసేదన్నా. వానలు పడేది మానేసినాయి. కరువుమింద కరువు వచ్చి పడతానే వుండాది. రైతుల చేతుల్లో దుడ్డేడిదన్నా బేరాలు పడిపాయ. కూతురిని మేనల్లుడికిచ్చి పెండ్లి జేస్తి'' తన బాధను వ్యక్తం చేశాడు రంగనాథం.

''ఏం జేస్తావ్ పాపం. దానికి దోడు ఆ శీనయ్యగోడొకడు. యిన్ని దినాలు చేస్తావుండే సర్పంచిగిరీ అయిపాయ. మొన్న ఎలక్షన్లో మళ్లా నిలబడెగానీ వోడిపాయ. సంపాయించిండే దుడ్డుతో మంచి షోకేసులు పెట్టి అంగరంగ వైభోగంగా ప్రొవిజన్ షాప్ పెట్టె. నీయాపారం నేలగరుచుకుండే.''

''అదేన్నా. గడ్డనపడిన శ్యాపమాదిరి తనకలాడతావుండా. అప్పులోళ్లకు ఎట్లో వొగ సర్ది సెప్తావుండ. అయినా ఇల్లమ్మినా గట్టెక్కేటిగా కనిపించలేదే''

అతని ముఖంలో క్షణకాలం పాటు తీండ్రించిన నిర్వేదపు ఛాయ ఒకటి తళుక్కున మెరిసి మళ్లీ మాయమైపోయింది.

''ఏమప్పా రంగనాథమూ చెక్కెర అరకేజీ, కందిబేడలు అరకేజీ'' అంటూ వచ్చాడు పక్కూరి సిద్ధరాములు.

''ఏం సిద్ధరాములూ... బాగుండావా?'' పలకరించాడు వీరప్ప.

''ఏం బాగులేమామా. రైతులు బాగుండే కాలం ఎప్పుడో పాయ'' నిష్టూరంగా అన్నాడు సిద్ధరాములు.

''యేమట్టంటివే'' అడిగాడు రంగనాథం.

''ఏముండాదబ్బా. అప్పుల్లో జనాలు అట్ల సావలేక, ఇట్ల బతకలేక సస్తా వుండారు'' అన్నాడు సిద్ధరాములు.

అతని కంఠంలో ఏదో నిర్వేదం ధ్వనించింది.

''నీకేమిరా నాకొండె.నీవు సరిగ్గా జేసినావు గదా. యింక నీ సంకల్లో సెయి బెట్టేవోడు ఎవుదుండాడు సెప్పు.'' ఏదో రహస్యం తెలుసుకున్న వాడిలా అన్నాడు వీరప్ప.

''నువ్వు భలేవాడివిలే మామా.'' ఏదో వినరాని మాట విన్నట్టు యిబ్బందిగా ముఖం పెట్టాడు సిద్ధరాములు.

రంగనాథం లేచి చక్కెర, బేడలు పొట్లం కట్టిచేతికిచ్చి ''దుడ్డియ్యబ్బా'' అంటూ చేయి చాచాడు.

''రేపు సంతనాటికిస్తాలే. లెక్కరాసుకో''

''బేడలు, చక్కెర అంగిట్లో ఏమీ లేవు. నాకని పెట్టుకున్నవి యిచ్చినా. యిప్పటికే నీది శ్యానా లెక్క అయుండాది. అదీగాక ఆర్నెళ్లముందు చీటీ ఎత్తుకుంటివి. కంతులూ సరిగ్గా కట్టలా. ఈ మాదిరిగా అయితే నేను కొంప అమ్ముకోని పోవాల్సిందే'' అన్నాడు రంగనాథం.

వీరప్ప ''ఉష్ ఉష్'' అంటూ ఏదో సైగ చేశాడు. కానీ రంగనాథంకు ఏమీ అర్థం కాలేదు.

''దుడ్డిచ్చి కొనుక్కోవాలంటే నీ దొగటేనా అంగడి. శీనయ్య అంగడిలేదా. రోంతట్ల బోతే పులిచెల్లో అబ్బయ్య చెట్టి అంగడిలేదా, సుబ్రమణ్యం లేడా''

''శీనయ్య తెలివి నాకెక్కడిది గానీ, యింక పులిచెర్లలో అంగళ్లోళ్లు అప్పంటే ఆమడదూరం పెడతార్లే. నాకు తెలీదా ఏమీ?''

''నిండా యిబ్బందిగా వుండాదబ్బా. రేపు సంతనాటికిస్తాలే'' పొట్లాలు అబ్బిళించి పట్టుకుని మరీ అన్నాడు సిద్ధరాములు.

వీరప్ప అతని వైపు మిర్రిమిర్రి చూడసాగాడు.

''సరే. సీటీ దుడ్లు ఎప్పుడిస్తావు?'' అడిగాడు రంగనాథం.

''యిస్తాన్లేబ్బా. కొంప పెరుక్కోని పోలేగానీ'' అంటూ అక్కడినుంచి వెళ్లిపోయాడు సిద్ధరాములు.

ఏమీ చేసేది లేక రంగనాథం నోరుతెరుచుకుని ఆతనివైపే చూస్తుండిపోయాడు.

''ఓరినీ పాసులగోల. సైగసేస్తావుంటే గూడా నీకర్థంగాలా. వాడికిచ్చిన అప్పు గోడకేసిన సున్నమే గదా'' తలపట్టుకుంటూ అన్నాడు వీరప్ప.



''ఏం చేయాలన్నా. యియ్యకపోతే పాతబాకీ ఎగ్గొడతాడని భయం'' అన్నాడు రంగనాథం.

''నీకు తెలిసినట్టులేదే. సిద్ధరాములు ఐ.పీ. యేసేసినాడంట''

''అదెట్ల యేసినాడన్నా?'' ఆతృతగా అడిగాడు రంగనాథం.

''వాడు అప్పుడప్పుడు సింతపండు యాపారం చేస్తావుండెగదా. అందుకని దాంట్లో నష్టమచ్చిందాదంటా పీలేరు కోరుట్లో ఐ.పి.యేసిండాడు. ఇప్పుడు వాడికి అప్పులిచ్చినోళ్లు సస్తావుండారు.''

''అయ్యో యిప్పుడు నా చీటీదుడ్లు, అంగిడి దుడ్లు బాకీ యెట్లన్నా?'' సెర్నాకోల దెబ్బతిన్నోడి మాదిరి దిగులుగా అన్నాడు రంగనాథం.

''యేంజేస్తావో ఏమోపో... నీరాతట్లుండాది!'' వీధిలోకి చూస్తూండిపోయాడు వీరప్ప.

''అది సరేన్నా. రెండ్రోజులు నేను తిరప్తికి మావోన్ని చూడను బోయింటిగదా. ఊర్లో యేమన్నా విశేషాలు.'' అంటూ అంగట్లోనుంచీ వచ్చి తిరిగి బెంచీపైన కూర్చుంటూ అడిగాడు రంగనాథం.

''నేనూ అదడిగిపోదామనే వచ్చింది. మాటల్లో బడి మరిచేపోయినాను.

నువ్వులేవుగానీ మొన్న వొంక మద్దోళ్ల పల్లెలో సహదేవరెడ్డి వుండ్లా. ఆయప్ప ఉరిబోసుకోని సచ్చిపాయ'' అన్నాడు వీరప్ప.

''అయ్యో నాకెవురూ సెప్పలేదే. ఎందుకు సచ్చిపోయినాడంటనా!''

''ఏముండాది. మామూలే! పల్లెకు పడమరగా ఆయప్పకు పదెకరాలచేనుంది గదా. అది అయిదేండ్లుగా బీడే. దాంట్లో బోరింగేయిస్తే మామిడి చెట్లన్నా నాటుకోవచ్చు గదాని సొసైటీలో లచ్చరూపాయలు దీసుకోని అయిదేండ్ల క్రితం బోరేయించినాడు. దాంట్లో నీళ్లుబడలే. ఊర్లో గూడా చేబదుల్లు దండిగానే వున్నాయంట. అందరూ వొగతూరిగా గొంతుపైన కూర్చోని యిచ్చింది కక్కూ అన్నారంట. ఆ బాధ తట్టుకోలేక ఆపంజేసుకున్నాడంట'' వివరించాడు వీరప్ప.

''అయ్యో.... యేందన్నా ఇట్టా కాలమొచ్చ.''

''జాంద్రపేటలో మగ్గాలతో సంసారం గడవక కైలమోళ్లాయన పురుగుల మందుదాగి పాణం తీసుకోని పదిరోజులు గాలా, యిప్పుడిది జరిగె.''

రైతుల కష్టాలన్నీ ఆతని కళ్లలో కన్నీటి చుక్కగా మారాయి.

''ఆ మద్దెన బాలిరెడ్డిగారి పల్లెలో మల్లిశెట్టి గూడా అప్పుల బాధ భరించలేక అదే దారి బట్టి ఆరునెలలాయేగదా.''

రంగనాథం గుండె ఆర్ద్రమైంది.

''వీళ్లంతా... మనం చస్తే సర్కారోళ్లు మన బిడ్డలకు లచ్చల్లో నష్టపరిహారం యిస్తారనీ, వోళ్లనింక అప్పులడిగేవాళ్లుండరనీ అనుకోని యిట్ల పాణం తీసుకుంటా వుండారనుకుంటా.'' తమాయించుకుంటూ అన్నాడు వీరప్ప.

''అయిండొచ్చు''

''కానీ కంపల్లెలో జగన్నాథందీ యింకోదారి.''

''ఏం దారన్నా?''

''అదే.... ఐ.పీ.దారి''

''సచ్చిపోయి పెండ్లాంబిడ్డల్ని అనాథలి చేసేకంటే అదేమేలుగావుండాదే.''

''అవును. అప్పిచ్చినోడు అడిగేదాని క్యూడాలే.''

''అట్ల సిగ్గూ సెరమూ వదిలేసి ఐ.పీ. చేసేకంటే సచ్చేదే మేలుగదన్నా.''

''అదెట్టరా. మిగులు వాసి వున్నోడేగదా అప్పిస్తాడు. అట్లా వోడికి దుడ్డు ఎగ్గొడితే తట్టుకుంటాడు. లేనోళ్లకు మోసం జేసేకంటే అది మేలుగదా.''

మనసువిప్పి మాట్లాడుకోవడంతో యిద్దరి మనసులు తేలికపడ్డాయి.

''అదిసరే. నువ్వు ఉతికిన గుడ్డలేసుకోని యాడికి యెలబారినావు.'' అతన్ని యెగాదిగా చూస్తూ అడిగాడు రంగనాథం.

''మా సెల్లిని వొంటి గుట్టలో యిచ్చినాంగదా. రొంపిచెర్ల దెగ్గర ఆడ, మా బామ్మర్ది, ఎవరో యిద్దరి రైతులకు బ్యాంకీ లోన్లు సూరిటీ యిచ్చినాడంట. వాళ్లు కట్టకపోతే వీడికి కోర్టు నోటీసులు వచ్చినాయంట. దాని గురించి మాట్లాడే దానికే యెలబారినా. పొయ్యొస్తా'' అంటూ పైకి లేచాడు వీరప్ప.

**చేసిన అప్పుల్ని కోర్టు ద్వారా ఎగ్గొడితే ఐ.పీ. అట్లాగాకుండా యింట్లో దీపం పెట్టేసి శాస్వితంగా ఊరొదిలేసి యెళ్లిపోతే అది ఇరసాలమిట్ట.**

''య్యేవ్ లచ్చుమన్నా.... అయిపోయిందిగానీ ఎద్దుల పూంచయ్యి బండికి పోదాము.'' వస్తువులు పడిపోకుండా చేంతాడు బిగించి బండిదిగిన దేవరాజులు కేకేశాడు. బండిలో వస్తువులు చిన్నపాటి కొండలా కనిపిస్తున్నాయి.

లచ్చుమయ్య ఎడ్లను పూన్చి కాడిమాను మెడలపైన పెట్టి పలుపులు బిగించి, నొగలపైన కూర్చొని పగ్గాలు లాగి ఎద్దుల్ని అదిలిస్తూ బండిని ముందుకు కదిలించాడు.

దేవరాజులు అక్కామామలకు జాగర్తలు చెప్పి బండి వెంట నడిచాడు.

వీరప్ప అదే దారిలో వంటిగుట్టకు బయలుదేరాడు.

* * *

అలా వెళ్లిన గెల్లపల్లోళ్ల వీరప్ప ఆ మరునాడు ఊర్లో అడుగుపెట్టేటప్పటికి ఆకాశంలో బారెడు ప్రాకిన పొద్దుతో బాటు రంగనాథం ఇంటిముందర జనాలు గుంపుగాచేరివున్నారు.

''ఏం జరిగిందిరా దేముడా! అప్పులోళ్ల బాధ భరించలేక వీడూ సావలేదు గదా'' అనుకుంటూ గుంపును సమీపించాడు.

''ఈతూరి సీటీ పోటీ లేకుండానే ఎత్తించిస్తాలే అంటూ నమ్మకంగా బలికె. ఆ దుడ్డుతో బిడ్డెకు పెండ్లి జేద్దామనుకుంటి. యిప్పుడిట్ల జేశ. ఏం జేసేదిరా దేముడా.'' పక్కనున్న వ్యక్తితో యేడుస్తూ చెబుతున్నాడు దొరస్వామి నాయుడు.

''ఏం జరిగిందన్నా''అంటూ అడిగాడు గడ్డం, జుట్టూ పెంచేసిన ఓ రైతు.

''రంగనాథమూ... పోయినాడన్నా...'' అన్నాడు ఆ గుంపులో మరో చినిగిన బట్టలేసుకున్న వ్యక్తి.

''అయ్యో మనిషి బాగున్నాడే... అప్పుడే తేరిపాయనా.....'' ఆర్ద్రంగా ముఖం పెట్టి అన్నాడు చొక్కాలేని యింకోవ్యక్తి.

''ఇంతపని జేస్తాడనుకోలే... వుంటే నరికేద్దును...'' రంగనాథంకు అప్పిచ్చిన జయరామిరెడ్డి ఆవేశంగా అరుస్తున్నాడు.

''వొరే. మిద్దింటి కవతలుండ్లా సుట్టిల్లు. ఆ యింట్లో యింకా దీపం మండతానే వుండాది. నేను బొయ్యి తలుపు సందులోనించి చూసొస్తి.'' అంగడిల్లు చుట్టుకొని వెళ్లి వచ్చిన ఓ వ్యక్తి ఏదో రహస్యం కనుక్కున వ్యక్తిలా చెబుతున్నాడు.

''అవును రంగనాథం యింట్లో దీపం పెట్టేసి... ఇరసాలమిట్ట ఎక్కేసినాడు.''

''సామాన్లన్నీ నిన్ననే బండికేసి పంపించేసినాడు. మిగిలినవి రేత్తిరి నైట్‌హాల్ట్ బస్సుకేసుకోని పోయినాడంట. ఎవరో అడిగితే ఈ ఊరికీ నాకూ ఋణబంధం తెగిపోయిందన్నా... ఊరొదలేసి యెళ్లిపోతా వుండా అన్నాడంటలే.''

''అది సరే. ఇరసాల మిట్టంటే యింతకీ యేందబ్బా.''

''చేసిన అప్పుల్ని కోర్టు ద్వారా ఎగ్గొడితే ఐ.పీ. అట్లాగాకుండా యింట్లో దీపం పెట్టేసి శాస్వితంగా ఊరొదిలేసి యెళ్లిపోతే అది ఇరసాలమిట్ట.''

తలోమాట... తలో అభిప్రాయం.

వారి మాటలు వింటుంటే వీరప్పకు మతిపోయినట్లనిపించింది.

''అయినా సిగ్గు సెరమూ వదిలేసి ఐ.పీ యేసేకంటే సచ్చేది మేలు గదన్నా అని ముందు రోజు అన్న రంగనాథం మాటలు అన్ని చెవుల్లో గింగురుమన్నాయి.

''రంగనాథం ఈ పనియెట్ల జేశ?'' అనుకుంటూ అందర్నీ తోసుకొని ముందుకెళ్లి ఆ యింటివైపు చూశాడు.

నలభై ఏళ్లుగా ఎంతో సందడిగా వున్న ఆ యిల్లు ఆ వేళ ఏ రాక్షసుడో చెరబట్టిన స్త్రీలా అనిపించింది.

అక్కడ రంగనాథాన్ని శాపనార్థాలు పెడుతున్న జనాలున్నారు. ఊరూ అలాగే వుంది. తాళం వేసివున్న ఆ ఇల్లు అలాగే వుంది. కానీ రంగనాథమే లేడు.

★